# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నేరస్థులకు సహకరించే పోలీసులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు.**

2. **మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.**

3. **రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30వ తేదీన పి-4 విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.**

4. **ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.**

==========================

నేరస్థులకు సహకరించే పోలీసులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. పిఠాపురంలో అభివృద్ధి పనులు, శాంతిభద్రతలపై నిన్న ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న నాలుగు పోలీస్‌స్టేషన్లలో పరిస్థితిపై ఇంటెలిజెన్స్ నివేదిక తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలని పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులని ఆదేశించారు.

-------------------------

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించి మహిళలలో నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీ కోర్సులు కూడా ఉచితంగా నేర్పిస్తామని మంత్రి పేర్కొంటూ..

**(వాయిస్ 35 సెకన్లు)**

-------------------------

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈనెల 30వ తేది ఆదివారం రాష్ట్ర సచివాలయంలో పి-4 విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర స్థాయిలో లాంఛనంగా ప్రారంభించనున్నారని అందుకు తగిన పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. 30వ తేదీ సాయంత్రం 5గంటల నుండి రాత్రి 7గంటల వరకూ ఈ కార్యక్రమం జరగనుందని కె.విజయానంద్ అన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో 53 లక్షలతో నూతనంగా నిర్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే భవనంలోని అదనపు వసతి గదులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

వేసవిలో అనంతపురం నగరంలో త్రాగు నీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళిక చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అనంతపురం నగరంలో 50 డివిజన్లకు మంచి నీటి కుళాయిలు ద్వార నీటి సరఫరా చేస్తున్నామని, పి ఎ బి ఆర్ జలాశయం నుండి నగరానికి నీటి సరఫరా చేయడం జరుగుతుందని కమీషనర్ పేర్కొంటూ..

**(వాయిస్ 21 సెకన్లు)**

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేదీ ఆదివారం ప్రసారం అవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. పొదలకూరులో విద్యుత్ శాఖ నూతన కార్యాలయ భవనాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూర్య ఘర్ యోజన పథకం కింద.. రూఫ్ టాప్ పైన నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చున్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని కూడా అందజేస్తుందని... దీనిని రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. గ్రామాలలోకి వెళ్లి ప్రజలకు ఈ పథకం పై అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వి.ఎస్.ఎమ్.రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

**(వాయిస్ 20 సెకన్లు)**

కాగా... ప్రజలు సాధ్యమైనంత వరకు ఎండలో తిరగరాదని అధికారులు పేర్కొన్నారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్కువగా నీరు, మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ వంటివి తాగాలని సూచించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఈ నెల 30, 31 తేదీల్లోనూ పని చేయనున్నాయని రెవెన్యూ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రెండు రోజులూ ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ.. ఉదయం 11.00 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు యథావిధిగా దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

---------------------------

సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమ అభివృద్ధి కోసం రూపొందించిన కేంద్ర ప్రభుత్వ పథకాలతో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన పాలూరు పద్మావతి తన కలంకారి పరిశ్రమను అభివృద్ధి చేసుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుపతి పర్యటనలో భాగంగా కలంకారీ చీరలను చూసి పద్మావతిని అభినందించారు. తన ఆర్థిక పరిస్థితిని పూర్తిగా మార్చేవేసిన కేంద్రప్రభుత్వానికి పద్మావతి కృతజ్ఞతలు తెలుపుతూ..

**(వాయిస్ 29 సెకన్లు)**

---------------------------

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఎంపానల్మెంట్ ఉన్న ఆసుపత్రులలో వైద్యం తీసుకోవడం ప్రజల హక్కు అని ఆదోని శాసనసభ్యులు పార్థసారథి అన్నారు. విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పేద వారికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైద్య బీమా ద్వారా 2లక్షల 50వేల రూపాయల నుంచి 25లక్షల రూపాయల వరకు ఎన్టీఆర్ వైద్య సేవ తో పేదలకి ఉచిత సేవలు అందిస్తామన్నారు.అందరికి ఆరోగ్యం అనే సూత్రం తో కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది అని పేర్కొన్నారు.

---------------------------

లేపాక్షి ఉద్యోగులకు ఇన్సెంటీవ్‌లను పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో ఉద్యోగులకు ఇన్సెంటీవ్ లు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత గుడ్ న్యూస్ తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో 97 లేపాక్షి విక్రయశాలల నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెల వరకూ హస్త కళా రూపాల అమ్మకాల ద్వారా రూ.5.50 కోట్ల మేర లాభాలు ఆర్జించినట్లు మంత్రి సవిత నిన్న విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

=====================